క్లుప్తంగా

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనిటీ అధికారి

నగరి : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో లింగవివక్షతకు సంబంధిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీ పీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగనిర్ధారణ నేరమన్నారు. సంబంధిత గర్భిణికి గానీ, ఆమె బంధువులకు గానీ మాటలు, సైగల రూపంలో పుట్టబోయే బిడ్డ లింగనిర్ధారణ వివరాలను వెల్లడించడం నేరమన్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక జలుబు, దగ్గు ప్రస్తుతం పలువురికి వస్తోందని వైద్యులను సంప్రదించి మందులు వాడాలన్నారు. సదస్సులో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్‌ఎంఓ కార్తీక్, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

200 మామిడి చెట్లు దగ్ధం


మంటల్లో కాలిపోయిన మామిడిచెట్లు

గంగాధర నెల్లూరు: మండలంలోని పెడకంటిపల్లిలో దాదాపు 200 మామిడి చెట్లు దగ్ధం అయిన సంఘటన శనివారం చోట చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పాపిరెడ్డిపల్లి పంచాయతీ పెడకంటిపల్లి రైతులు శ్యామలమ్మ, చలపతి రెడ్డి, లింగారెడ్డికి చెందిన దాదాపు 200 మామిడి చెట్లు అనుమానాస్పదంగా దగ్ధమయ్యాయని తెలిపారు. దాదాపు 20 ఏళ్ల వయసు గల చెట్లు కాపునకు వచ్చిన దశలో మంటల్లో దగ్ధం కావడంతో సదరు రైతులు లబోదిబోమంటున్నారు. ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు అదుపు చేశారు. బాధిత రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి గోడు వెల్లబోసుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పాలసముద్రం : ప్రతిఒక్కరూ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి, వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ వివరించారు. శనివారం డ్వాక్రా సంఘ సభ్యులతో కలసి ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. మంచి నాయకత్వం కోసం ఓటు వేయడం ముఖ్యమన్నారు. అనంతరం ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, డ్వాక్రా సంఘ సభ్యురాలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయస్వామి ఆలయ అన్నదానానికి శనివారం తిరుపతికి చెందిన వాసవీ కుటుంబ సభ్యులు నగదు విరాళంగా చేశారు. రూ.1,01,116 ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు దర్శనం కల్పించి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు విష్ణుష్ తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ 2024కు 10వతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి 25 తేదీ వరకు కళాశాలలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7780319955, 8179433557 నంబర్ల లో సంప్రదించవచ్చని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి


ఎన్నికల ప్రచారంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు


నింద్ర: అగరం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి

- జగనన్న సీఎంగా ఉంటేనే సంక్షేమ ఫలాలు కొనసాగుతాయి
- అందుకే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా చేసిన అభివృద్ధిని చూసి మరోమారు ఆదరించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అలాగే నగరిలో రోజా ఎమ్మెల్యే కావాలని ఇందుకు ప్రతి ఓటరు మద్దతు పలకాలని కోరారు. శనివారం పుత్తూరు మున్సిపాలిటీ 18వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి కుటుంబం ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరారు. మంత్రి రోజా నేతృత్వంలో వడమాలపేట మండలంలో అనేక అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. నగరి నియోజకవర్గంలో అడిగిన ప్రతి పనిని ముఖ్యమంత్రి మంజూరు చేశారని చెప్పారు. ప్రత్యేకించి మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మనసున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇందుకు ప్రతి మహిళా సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తున్నారని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకుని ప్రచారం చేస్తోందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో మంచి చేయలేని వారు, నేడు ఎలా చేస్తారంటూ ప్రజలే ప్రశ్నించాలని కోరారు. జగనన్న సైనికులుగా, మీ ఇంటి ఆడపడుచుగా అహర్నిశలు ప్రజాక్షేమం కోసం పనిచేస్తున్న మంత్రి రోజాను నగరి ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, వార్డు కౌన్సిలర్ రాధ, మైనారిటీ డైరెక్టర్ మాహిన్, పార్టీ నాయకులు లారీమోహన్, మనోహర్‌రెడ్డి, చిన్నా, షకీలా, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి

నింద్ర: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రజల స్థితిగతులను మార్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోమారు ఆదరించాలని జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం అగరం పంచాయతీలో 'మేము సిద్ధం– మా బూత్‌సిద్ధం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల బతుకుల్లో సంక్షేమ పథకాలను అందించి వెలుగులు నింపిన నాయకుడు జగనన్న అని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పనులు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మనం జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. నగరి నియోజకవర్గంలో ప్రతి పేదవాడికి ఇంటి స్థలం ఇచ్చి సొంతింటి కలను నెరవేర్చిన ఘతన కూడా జగనన్నదే అన్నారు. ఈ సంక్షేమ ప్రభుత్వం తిరిగి రావాలంటే అంతా కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నగరిలో రోజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్‌సీపీ యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కోఆప్షన్ సభ్యులు అనిల్, జిల్లా పార్టీ కార్యదర్శి మేరి, మహేష్, సర్పంచ్ చెల్లెమ్మ, నాయకులు సెల్వం, వెంకటేష్, అబ్రహాం, విరయ్య, దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, మునిరాజు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బట్టీకండ్రిగలో..


వడమాలపేటలో ..

పుత్తూరు: సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడానికి ఓటర్లు తాము సిద్ధం అంటున్నారని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం వడమాలపేట మండలం బట్టీకండ్రిగ గ్రామంలో 'మేము సిద్ధం– మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, వారిని బూత్ వద్దకు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మంత్రి రోజమ్మను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

- రూ.4.21 లక్షల నగదు స్వాధీనం


కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కార్వేటినగరం: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తమిళనాడు సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ సత్యబాబు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. శనివారం చంద్రగిరి మండలం సీ.మల్లవరం గ్రామానికి చెందిన పురుషోత్తం ఆచారి తమిళనాడులోని పళ్లిపట్టులో బంగారు నగలు కొనుగోలు కోసం రూ.4.21 లక్షలు తీసుకెళ్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు చెప్పారు. అందుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి రికార్డులు లేకపోవడంతో నగదును ఆర్‌ఓకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదుకు సంబంధించి తగిన ఆధారాలు లేకుండా ఎక్కడికీ తీసుకెళ్లవద్దని విన్నవించారు. అలాగే గ్రామాల్లో పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

నేడు ఈస్టర్ వేడుకలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని పలు చర్చిలు ఈస్టర్ వేడుకలకు ముస్తాబయ్యాయి. గుడ్ ఫ్రైడే తర్వాత వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు ఈస్టర్ పర్వదినంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈస్టర్‌ను ఉద్దేశించి మత పెద్దలు ప్రసంగించనున్నట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ, సమావేశానికి హాజరైన అఖిలపక్ష నేతలు, అధికారులు

- ఎన్నికల అధికారి, ఆర్డీఓ వెంకటరెడ్డి

నగరి : ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారి ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అన్ని పార్టీల వారు తప్పకుండా పాటించాలన్నారు. సమావేశాలు పెట్టాలన్నా, ఫ్లెక్సీలు పెట్టాలన్నా, కరపత్రాలు వేయాలన్నా, ప్రచారం చేయాలన్నా అనుమతి తప్పనిసరి అన్నారు. నియోజకవర్గంలోని వడమాలపేటలో 31 పోలింగ్ కేంద్రాలు, పుత్తూరులో 64, నగరిలో 80, నింద్రలో 25, విజయపురంలో 29 పోలింగ్ కేంద్రాలు చొప్పున 229 కేంద్రాలు ఉన్నాయని పుత్తూరులోని 52, 68 పోలింగ్ స్టేషన్లలో 1500 ఓటర్లు ఉన్నందున రెండు ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్లను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. దీంతో నియోజకవర్గంలో 231 పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. ఫారం 7, 8 దరఖాస్తులకు గడువు ముగిసినందున వాటిని స్వీకరించడం జరగదన్నారు. ఏప్రిల్ 15వ తేదీవరకు కొత్త ఓటరు నమోదు ఫారం–6 స్వీకరిస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలింగ్ ఏజెంట్ల నియామకంలో ఎన్నికల సంఘం నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ముందస్తు హెచ్చరికలపై శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై, తయ్యూరు, కొత్తపల్లి మిట్ట పుల్లూరు గ్రామాల్లో శ్రీరంగరాజపురం పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుళ్లాయప్ప మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలు తావివ్వకూడదన్నారు. ఎన్నికల్లో కోడ్ అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరూ నియమావళి పాటించాలని సూచించారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభ పెట్టిన బెదిరించినా, పరోక్షంగా ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మూడు తరాల సమస్య పరిష్కారం

- రోడ్డు వేయించిన మంత్రి రోజా
- కావేటిపురం దళితవాడ గ్రామస్తుల కృతజ్ఞతలు


ఇదివరలో అధ్వానంగా ఉన్న మార్గం (ఫైల్)


పక్కాగా నిర్మించిన రోడ్డుపై గ్రామస్తుల రాకపోకలు

నగరి : మండలంలోని బీరకుప్పం పంచాయతీ కావేటిపురం దళితవాడను మూడు తరాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్య ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారమైంది. సుమారు 60 కుటుంబాలు 185 మంది జనాభా నివశించే ఈ దళితవాడకు సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. గ్రామానికి వెళ్లడానికి సరైన దారి కూడా లేక ముళ్లకంపలతో మూసుకుపోయిన దారిలోనే రాకపోకలు సాగించేవారు. గత పాలకులకు రోడ్డు సమస్య విన్నవించినా, పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం గ్రామానికి పక్కారోడ్డు వేసి మౌలిక వసతులను కల్పించింది. శనివారం నుంచి రోడ్డు గ్రామస్తులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. నూతన రోడ్డుపై నిలబడి వారు ప్రభుత్వానికి, రోడ్డు వేయించిన మంత్రి ఆర్కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాత, ముత్తాతల కాలం నుంచి అంతంత మాత్రమే ఉన్న మార్గంలోనే జీవనం కొనసాగించారన్నారు. రాత్రి పూట గ్రామానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవారమన్నారు. వర్షాలు వచ్చే సమయంలో నరకం ప్రత్యక్షంగా కనిపించేదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ఈ సమస్యను మంత్రి ఆర్కే దృష్టికి తీసుకెళ్లామని ఆమె మా సమస్యను అర్థం చేసుకొని తుడా నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించి ఈ నెల 2వ తేదీన భూమిపూజ వేసి పనులు ప్రారంభించారన్నారు. రోడ్డు వేసే క్రమంలో ప్రతిపక్షాలు ఎన్నో అడ్డంకులు సృష్టించాయని, అయినా వాటిని అధిగమించి పక్కా రోడ్డును నిర్మించి తమకు అందుబాటులోకి తెచ్చారన్నారు. నిజంగా ఇది పేదల కోసం పనిచేసే ప్రభుత్వమే అనడానికి ఇంతకన్నా మరో సాక్ష్యి ఏంకావాలన్నారు. ఎంపీటీసీ తులసీచంద్ర రెడ్డి, రూరల్ మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి శశికుమార్, సర్పంచ్ సెల్వి, వైస్ సర్పంచ్ దేవరాజ్, మాజీ సర్పంచ్ ఏలుమలై రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, నాగభూషణం, ఆర్.శేఖర్, వేలాయుధం, పళని, శ్రీనివాసులు, శివ, ముకుందం, వడివేలు, రాజేంద్ర, వెంకటేష్, ఎం.ఏలుమలై రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గేటు వసూలు పెంచడం అన్యాయం


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పుత్తూరు: మున్సిపాలిటీలోని ఆటో వర్కర్స్ గేటు వసూలును రూ.10 నుంచి 20కి పెంచడం అన్యాయమని స్థానిక సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. 2024–25 ఆర్థిక ఏడాదిలో భాగంగా ఏప్రిల్ 1నుంచి ఆటో గేటును పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం ఇన్‌చార్జ్ కమిషనర్ పెంచలయ్యకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని ఏ మున్సిపాలిటీలోనూ గేటు వసూలు చేయడం లేదని గుర్తు చేశారు. ఒక్క పుత్తూరులో మాత్రమే ఆటో వర్కర్స్ నుంచి గెజిట్‌లో కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది రూ.10 ఉండగా దానిని రూ.20కి ఎలా పెంచుతారని ప్రశ్నించారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల నేపథ్యంలో గేటు పెంచడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తేల్చి చెప్పారు. టెండర్లను రద్దు చేసి, కొత్తగా టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, బాషా, బాబు, చంటి, కృష్ణ, ధన, సీఐటీయూ నాయకులు భాస్కర్, వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటరమణయ్య, ప్రధాన కార్యదర్శి మురగారెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.అంకయ్య, ఆర్థిక కార్యదర్శి రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

అన్నదానం


శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో పేదలకు అన్నదానం చేపడుతున్న దృశ్యం

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన యువరాజు కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం ముందుకు వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాల్లో కాకుండా దాతల ఇష్టానుసారం రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత యువరాజు కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఎనిమిది ఫిర్యాదుల పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : మోడల్ కోడ్ నిబంధనలను అతిక్రమిస్తున్నారంటూ అందిన ఎనిమిది ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారు. ఈ మేరకు ఈ నెల 30వ తేదీన జిల్లాలోని రొంపిచెర్ల, పుంగనూరు, సదుం, పుత్తూరు, నగరి, కుప్పంలలో 8 ఫిర్యాదులను ఆయా ఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత ఫిర్యాదుల పరిష్కారానికి చేపట్టిన చర్యలను నివేదికల రూపంలో ఎంసీసీ కమిటీకి అందజేశారు. జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి మురళీకృష్ణ జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్‌కు ఆ నివేదిక పంపారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవమూర్తులను కూడా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పండరి భజనతో బుచ్చినాయుడుకండ్రిగ ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.